


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 10-12-2025 సంపుటి : 07 సంచిక 213 పేజీలు : 8 వెల : రూ 3-00


# 2047 నాటికి నెంబర్ వన్ కు ఇండియా, ఇండియన్స్: సీఎం చంద్రబాబు



అమరావతి, డిసెంబర్ 9: వాజ్ పేయి స్ఫూర్తిని యువతలో నింపేలా 'అటల్ సందేశ్... మోదీ సుపరిపాలన' యాత్ర తలపెట్టిన బీజేపీ కార్యవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. ఎన్డీయే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు చేపట్టే 'అటల్ సందేశ్ – మోదీ సుపరిపాలన' యాత్రలో పాల్గొనాలని నేతలకు పిలుపునిచ్చారు. రాజకీయ భీష్మునిగా భావించే అటల్ జీ శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషమన్నారు. దేశంలో సుపరిపాలనకు వాజ్‌పేయి నాంది పలికారని... ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాదిని వేశాయని గుర్తుచేశారు. వాజ్ పేయి అజాత శత్రువని, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని అన్నారు.ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్ పేయి.. కష్టంతో ఎదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9 సార్లు లోక్‌సభకు, 2 సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోందని సీఎం వెల్లడించారు. 18 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని.. 1998లో పోఖ్రాన్?2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తిని చాటారని కొనియాడారు. కార్గిల్ యుద్ధంతో శత్రువుకు తిరుగులేని సమాధానం ఇచ్చారన్నారు. వాజ్ పేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశ దశ దిశ మార్చిందన్నారు. తనకు వ్యక్తిగతంగా కూడా ఆయనతో అనుబంధం ఉందని.. రాష్ట్రాభివృద్ధిలో ఆయన నాడు ఎంతో సహాయం చేశారని తెలిపారు. రాష్ట్రం కోసం ఏది అడిగినా కాదనేవారు కాదన్నారు.ప్రజలకు పనికొచ్చే పనులు ఏం చెప్పినా చేస్తారని.. పాలసీల రూపకల్పన గురించి చాలా త్వరగా నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. టెలీ కమ్యూనికేషన్ రంగం, విమానయాన రంగంలో సంస్కరణలకు నాంది పలికారన్నారు. సుపరిపాలన ఏ విధంగా ఉండాలో ఎన్టీఆర్, వాజ్ పేయిను చూస్తే అర్థమవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ కూడా విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని... పట్టుదల, అనునిత్యం మంచి చేయాలనే ఆలోచనతో ఉండేవారని ముఖ్యమంత్రి అన్నారు. నాడు అణు పరీక్షలు అయినా, నేడు సింధూర్ అయినా... నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా అవి ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047కు నెంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. 2047 నాటికి ఇండియా, ఇండియన్స్ నెంబర్ వన్ స్థానానికి వెళ్తారని ధీమా వ్యక్తం చేశారు. వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొని విజయవంతం చేయాలని... 'అటల్ సందేశ్ – మోదీ సుపరిపాలన' కార్యక్రమాన్ని విజయంతం చేయాలని నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# అమెరికా టూర్‌లో లోకేష్ బిజీ..



## ఓప్స్ ర్యాంప్ సీఈవోతో కీలక చర్చలు

అమరావతి/శాన్ ఫ్రాన్సిస్కో, డిసెంబర్ 9: అమెరికా పర్యటనలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బిజీబిజీగా గడుపుతున్నారు. ప్రముఖ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో మంత్రి వరుసగా భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మతో భేటీ అయిన మంత్రి లోకేష్... ఐటీ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఏపీలో స్మార్ట్ సిటీలు, డిజిటల్ గవర్నెన్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ల కోసం ఐటీ మౌలిక సదుపాయాల ఆధునీకరణకు మద్దతు ఇవ్వాలని వినతి చేశారు.ఏఐ ఓప్స్ శిక్షణ, ఇంటర్న్ షిప్‌లు, ఆర్ అండ్ డి సహకారం కోసం ఏపీ టెక్ అకడమియాతో భాగస్వామ్యం వహించాలని కోరారు. స్కేలబుల్ ాజీజీూ మోడల్స్ ద్వారా ఐటీ కార్యకలాపాల నిర్వహణతో పాటు ఏపీలో ాఓఇలు, స్టార్టప్‌లను ప్రారంభించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మ స్పందిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థకు 500+ సంస్థలు కస్టమర్లుగా ఉన్నాయని తెలిపారు. వీటిలో ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, టెక్నాలజీలో పాటు ఫార్చ్యూన్ సహా 500 కంపెనీలు ఉన్నాయని వెల్లడించారు. భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్‌లో ప్రధాన కేంద్రాల ద్వారా ఏఐ ఓప్స్, క్లౌడ్ నేటివ్ మానిటరింగ్‌లో ఆవిష్కరణలను ముందుకు తెస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మ పేర్కొన్నారు.అంతకు ముందు అంతర్జాతీయస్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్‌ను మంత్రి లోకేష్ కలిశారు. విశాఖనగరం ఐటీ, డేటా హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని.. ఆంధ్రప్రదేశ్‌లో సెలెస్టా క్యాపిటల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. సెమీ కండక్టర్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని అన్నారు. కంపెనీలకు ఏపీ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమైన సమగ్ర ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. పరిశ్రమలకు నిర్ణీత సమయంలో నేరుగా ప్రోత్సాహకాలను అందించేందుకు దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఎకౌంట్ విధానాన్ని ప్రారంభించనునట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు.

మీ ప్రతిపాదనలు పరిశీలిస్తాం: అరుణ్ కుమార్

తాము ప్రధానంగా యూఎస్, ఇండియా, ఇజ్రాయెల్, ఆగ్నేయాసియా దేశాలపై దృష్టిసారిస్తున్నామని సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్ తెలిపారు. సెమీకండక్టర్లు, ంఎ/ఓఒ, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి డీప్ టెక్ రంగాలు, సాస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లాంటి ఎంటర్ ప్రైజింగ్ సాఫ్ట్ వేర్, గ్లోబల్ మార్కెట్‌లను అనుసంధానించే స్టార్టప్‌లలో పెట్టుబడులకు తాము ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అరుణ్ కుమార్ వెల్లడించారు.

# జాతీయగీతం బెంగాల్‌కు పరిమితం కాదు..


## ప్రియాంకకు అమిత్‌షా కౌంటర్

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తిప్పికొట్టారు. జాతీయగీతం బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. జాతీయగీతాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జాతీయగీతం 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యసభలో మంగళవారంనాడు జరిగిన చర్చలో అమిత్‌షా పాల్గొన్నారు.వందేమాతర గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకోవడంపై చర్చ ఎందుకని కొందరు సభ్యులు ప్రశ్నిస్తున్నారని, అయితే కాలంతో సంబంధం లేకుండా దేశప్రజల్లో వందేమాతరం ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉందని అమిత్‌షా అన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔన్నత్యం ఉందని, 2047లోనూ ఉంటుందని చెప్పారు. వందేమాతర గీతాన్ని ఎందుకు చర్చించాలని ప్రశ్నించే వారు ఆత్మపరిశీలన చేసుకోవాలని



సూచించారు. ఎన్నికలకు ముడిపెట్టి వందేమాతరం కీర్తిని తక్కువచేసి చూపాలని కొందరు అనుకుంటున్నారని విమర్శించారు.వందేమాతరం గీతాన్ని రచించిన బంకిం బాబు బెంగాల్‌లో పుట్టడం నిజమని, కానీ వందేమాతర గీతం బెంగాల్‌కో, ఇండియాకో మాత్రమే పరిమితమైంది కాదని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన భారతీయ వీరులు ప్రపంచంలో అజ్ఞాతంగా ఎక్కడ కలిసినా వందేమాతరం అని నినదించేవారని అన్నారు.

# రెవెన్యూ సేవలు మరింత సులభతరం: సీఎం చంద్రబాబు



అమరావతి, డిసెంబర్ 09: రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలు ఆటో మ్యుటేషన్ జరగాలని ఆయన పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలని ఆయన ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ఈ సందర్భంగా వారికి సూచించారు. రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని వారికి తెలిపారు. ప్రతి నెలా రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహిస్తానని వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తం అయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. గత పాలకులు చేసిన పాపాల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు.ఏడాదిన్నరగా వైసీపీ ప్రభుత్వ పాపాలు కడిగేందుకు కృషి చేస్తున్నందు వల్లే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దోచుకునేందుకు గత పాలకులు అస్తవ్యస్తం చేసిన విధానాలు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నాయని పేర్కొన్నారు. 7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీ సర్వే పూర్తి చేశామని వివరించారు.అవినీతి,అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్ట్ కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. జాయింట్ కలెక్టర్లు లేని జిల్లాలకు వెంటనే వారిని నియమించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పని చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. భూ సమస్యలన్నింటికీ ఇకపై జాయింట్ కలెక్టర్లదే బాధ్యత అని మంత్రి అనగాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

22ఏ, ఫ్రీ హోల్డ్ సమస్యలు పరిష్కారానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. భూ వివాద రహిత ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దేందుకు ప్రతీ బుధవారం కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై ఎల్లుండి మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కానుందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు. ఇప్పటి వరకు 86 శాతం సమస్యలు పరిష్కరించామన్నారు. 14 శాతం పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం న్యాయపరంగా, విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నదే తమ లక్ష్యమని మంత్రి అనగాని పేర్కొన్నారు.




# సంపాదకీయం

బుధవారం 10-12-2025

## రుణాల రద్దు ఎన్నాళ్లు... ఎన్నేళ్లు

ఈమధ్య కాలంలో బ్యాంకులు తరచుగా వార్తల్లోకొస్తున్నాయి. హెడ్‌లైన్స్‌గా మారుతున్నాయి. దానికి ముఖ్యమైన కారణం.. మొండి బకాయిలు. బ్యాంకింగ్ భాషలో ఎన్‌పీఏ.. నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ అంటారు. ఈ వారం లబ్ డబ్బులో ఎన్‌పీఏ గురించి తెలుసుకుందాం.బ్యాంకులు అనేక విధాలుగా లోన్లు ఇస్తూ ఉంటాయి. పెద్ద మొత్తంలో లోన్లు తీసుకుని అవి ఎగ్గొట్టి కొందరు, బకాయిలు తీర్చే స్థోమత లేక కొందరు... ఇలా చాలామంది బ్యాంకులకు మోత మోగిస్తున్నారు. వీటినే మొండి బకాయిలు అంటారు. అయితే రిజర్వు బ్యాంకు చెబుతున్న దాని ప్రకారం బ్యాంకులకు తామిచ్చిన రుణాలకు వాయిదాలు తిరిగి రాకపోతే వాటిని ఎన్‌పీఏ అంటారు. 2008 సెప్టెంబర్‌లో భారతదేశంలో మొండి బకాయిల విలువ రూ. 53,917 కోట్లు ఉండగా పది సంవత్సరాలకు.. అంటే 2018 నాటికి రూ. 8,40,958 కోట్లకు అమాంతం పెరిగిపోయింది.ఏకంగా ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు. దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఇదీ పరిస్థితి. ఇంత డబ్బు ఉంటే దేశంలో ఉన్న రైతులకు చాలా వరకు రుణ మాఫీ చేసేయొచ్చు. తాగునీటికి కటకటా అంటున్న ప్రజలకు ప్రతి రోజూ మంచి నీరు సరఫరా చేయొచ్చు.సామాన్యుల ఊహకు కూడా అందనంత అప్పులు తీసుకుని వాటిని ఎగ్గొట్టేసి ఏ విదేశాలకో వెళ్లి సెటిల్ అయిపోతే బ్యాంకులు మాత్రం ఏం చేస్తాయి లెండి! ఎవరైనా ఏ లక్ష రూపాయలో లోన్ తీసుకుని నిజంగానే డబ్బు లేక వాయిదాలు కట్టలేకపోతే వాళ్ల మీద మాత్రం బ్యాంకులు తమ ప్రతాపం చూపిస్తాయి!!బ్యాంకుల మొండి బకాయిలకు ముఖ్య కారణం పరిశ్రమలు. ఇంతకుముందు నేను చెప్పినట్టు కొంతమంది బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని తుర్రుమన్నారు. ఇక స్టీల్ కంపెనీలు నష్టాల్లో ఉండడంతో వారి నుంచి కూడా తిరిగి ఆ డబ్బు రావట్లేదు. వ్యవసాయ రంగం, సేవల రంగం కూడా బ్యాంకులను మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి.దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. గత అయిదున్నరేళ్లలో ఏకంగా రూ. 6.15 లక్షల కోట్ల మేర రుణాల్ని రైటాఫ్ చేశాయి. సాంకేతికంగా రద్దు చేశాయని చెప్పొచ్చు. ఈ మేరకు పార్లమెంటులో.. కేంద్ర మంత్రి పంకజ్ చౌధరి వెల్లడించారు. అయితే ఇది రుణమాఫీ కాదని.. బకాయిల వసూలు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు.5 ఆర్థిక సంవత్సరాలు సహా ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు.. అంటే మొత్తంగా అయిదున్నర సంవత్సరాల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు లక్షల కోట్ల మేర రుణాల్ని సాంకేతికంగా రద్దు చేశాయి. అంటే లోన్ రైటాఫ్ చేశాయన్నమాట. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ఈ విషయాల్ని పార్లమెంటులో వెల్లడించారు. ఏకంగా రూ. 6,15,647 కోట్లు లేదా రూ. 6.15 లక్షల కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు తెలిపారు. రుణాల రైటాఫ్ రుణ మాఫీ కిందికి రాదని.. ఇది ఆర్థిక పరమైన ప్రక్రియ మాత్రమేనని మంత్రి పేర్కొన్నారు.సాధారణంగా రైటాఫ్ అంటే.. ఆర్బీఐ మార్గదర్శకాలు, బ్యాంక్ బోర్డులు ఆమోదించిన విధానాల ప్రకారం.. నిరర్థక ఆస్తులుగా మారిన నాలుగేళ్లకు.. పూర్తి కేటాయింపులు చేసినటువంటి రుణాల్ని బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్ నుంచి తొలగించేందుకు ఇలా రైటాఫ్ చేస్తాయి. మరో సులభ భాషలో చెప్పాలంటే.. బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా.. బకాయి ఉన్న లోన్‌ను తిరిగి వసూలు చేయడం దాదాపు అసాధ్యం అని నిర్ధరించినప్పుడు.. ఆ లోన్ మొత్తాన్ని తమ అకౌంటింగ్ పుస్తకాల నుంచి అధికారికంగా తొలగిస్తుంది.లోన్ రైటాఫ్ అంటే సదరు రుణ గ్రహీతకు మాఫీ ఇచ్చినట్లు కాదు. ఇప్పటికీ సదరు రుణ గ్రహీత తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఉంటుంది. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్‌ను క్లియర్‌గా ఉంచుకునేందుకు.. మొండి బకాయిల భారం తగ్గించుకునేందుకు ఈ చర్య చేపడతాయని చెప్పొచ్చు. రైటాఫ్ చేసినప్పటికీ.. రుణ గ్రహీత క్రెడిట్ స్కోరుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది భవిష్యత్తులో వారికి లోన్లు అందకుండా అడ్డుకుంటుంది.ఇదే విషయాన్ని కేంద్ర మంత్రి వెల్లడించారు. రైటాఫ్ చేసినప్పటికీ.. బ్యాంకులు రుణాల వసూలు ప్రక్రియ కొనసాగిస్తాయని.. ఇక్కడ రుణ వసూలు ట్రైబ్యునల్స్, నేషనల్ లా కంపెనీ ట్రైబ్యునల్ వంటి చట్టపర మార్గాల ద్వారా.. లోన్ రికవరీ ఏజెంట్ల ద్వారా ఆ మొత్తాన్ని రాబట్టుకునేందుకు ప్రయత్నిస్తాయని పంకజ్ చౌధరి పేర్కొన్నారు. ఇక గత ఐదు సంవత్సరాలలో చూస్తే.. రైటాఫ్ చేసిన రుణాల నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు కేవలం రూ. 1.65 లక్షల కోట్లను మాత్రమే రికవరీ చేసుకోగలిగాయి.పెద్ద మొత్తంలో లోన్ రైటాఫ్ చేసినప్పటికీ.. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగ్గానే ఉందని.. ఇటీవలి కాలంలో మరింత మెరుగైందని కేంద్ర మంత్రి వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వ బ్యాంకులకు.. ప్రభుత్వం ఎలాంటి మూలధన సాయం అందించలేదని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆ బ్యాంకులు తమ మూధన అవసరాల్ని తీర్చుకునేందుకు మార్కెట్ సహా ఇతర వనరులపై ఆధారపడుతున్నాయన్నారు. ఈక్విటీ, బాండ్లను జారీ చేయడం ద్వారా ప్రభుత్వ బ్యాంకులు 2022-25 మధ్య కాలంలో రూ. 1.79 లక్షల కోట్లను సమీకరించినట్లు తెలిపారు. బ్యాంకింగ్ మోసాల్లో మోసగాళ్లు రూ. 3,588.22 కోట్లు కొల్లగొట్టగా.. రూ. 238 కోట్లు వసూలైనట్లు మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థలో మొండి బకాయిలు 2.3 శాతం వరకు పెరిగే వీలున్నదని ప్రముఖ భారతీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తాజాగా అంచనా వేసింది. నిజానికి బ్యాంకుల ఎన్‌పీఏలు గత కొన్నేండ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి.ఈ నేపథ్యంలోఇక్రాఅంచనా ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నదిప్పుడు. 2021 నుంచి 2025 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ఎన్‌పీఏలు 9.11శాతంనుంచి 2.58శాతానికి తగ్గుముఖంపట్టాయి.క్రమంలోమళ్లీబాగానే పెరగవచ్చని ఇక్రా అంటు న్నది.ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంక్ రుణ వృద్ధి 10.7 శాతం నుంచి 11.5శాతానికి పెరగొచ్చని ఇక్రా అంచనా వేస్తున్నది. వస్తు, సేవలపన్ను(జీఎస్టీ) సంస్కరణలు, పండుగ సీజన్ కలిసొచ్చి క్రెడిట్‌కు డిమాండ్ ఏర్పడిందని చెప్తున్నది.

## ఢిల్లీ పీఠాలనే కదిలించిన దీక్ష.. చరిత్రలో కేసీఆర్ సంతకం చెరిపేస్తే చెరిగిపోదు : జీవన్ రెడ్డి

నిజామాబాద్, డిసెంబర్ 9 : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో కేసీఆర్ సంతకం చెరిపేస్తే చెరిగిపోయేది కాదని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు 2009లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డిసెంబర్ 9వ తేదీ విజయ్ దివస్‌ను మంగళవారం నిజామాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో పండుగ



వాతావరణంలో ఘనంగా నిర్వహించారు.నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో', నేను చస్తే శవయాత్ర, తెలంగాణ వస్తే జైత్రయాత్ర అన్న నినాదంతో నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని గుర్తు చేశారు. ఆనాటి కేసీఆర్ దీక్ష ఢిల్లీ పీఠాలనే కదిలించి డిసెంబర్ 9న చిదంబరం ప్రకటన చేశారని ఆయన పేర్కొంటూ 2014 జూన్ 2 తెలంగాణ స్వరాష్ట్ర అవతరణ తో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైందన్నారు.కేసీఆర్ దీక్షా దివస్ లేకపోతే డిసెంబర్ 9 ప్రకటన లేదని, ఆ ప్రకటనే లేకుంటే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావమే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ ఏటా నవంబర్ 29వ తేదీన దీక్షాదివస్, డిసెంబర్ 9వ తేదీన విజయ్ దివస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజు నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష, ఆశలు ఫలించిన సుదినంగా జీవన్ రెడ్డి అభివర్ణించారు.తెలంగాణ ప్రజల్లో ఉన్న పౌరుషాన్ని మండించటంలో కేసీఆర్ అగ్గిమంటై నిలిచారన్నారు. తెలంగాణ మహోన్నత సంకల్పాన్ని గాంధేయ మార్గంలో రాజకీయ ప్రక్రియగా మలిచి దాన్ని లక్షలాది ప్రజల సింహగర్జనగా, జనఘోషగా కేసీఆర్ మార్చగలిగారని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ అన్నికోణాల నుంచి ఉద్యమాన్ని రగిలించి ఆమరణ నిరాహారదీక్షకు దిగారన్నారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులు కేసీఆర్ చేసిన ఆమరణ దీక్ష మొత్తం తెలంగాణ సమాజాన్ని కదిలించిందన్నారు.నవంబర్ 29న సిద్దిపేటలో ఆమరణ దీక్షను అడ్డుకుని అరెస్టు చేయటంతో తెలంగాణ అట్టుడికిపోయిందని, కేసీఆర్ తన మాటల్ని తూటాలుగా మార్చారని, ప్రజా ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమ ప్రక్రియగా మలిచారని ఆయన కొనియాడారు. అమరుల త్యాగాలతో తెలంగాణ తల్లడిల్లుతుంటే కేసీఆర్ తన ఆమరణ నిరాహారదీక్షతో కేంద్రం కళ్లు తెరిపించారన్నారు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం అన్న ప్రకటన తెప్పించగలిగిన ధీశాలి, శక్తిమంతుడు కేసీఆర్ అని ఆయన ఉద్ఘాటించారు. తెలంగాణ ప్రజలంతా ఏదైతే కోరుకున్నారో దాన్ని సాధించిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా కేసీఆర్ చరిత్రలో మిగిలిపోయారన్నారు.

## బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించుకోవాలి : వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

హనుమకొండ రస్తా, డిసెంబర్ 8: బీసీలను మోసం చేసిన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలంటే ప్రస్తుతం జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించి బీసీల రాజకీయ చైతన్యాన్ని చాటి చెప్పాలని బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 15,16 వ తేదీలలో చేపట్టబోయే ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి పోస్టర్లను బీసీ జేఏసీ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేమని, పార్టీపరంగా 60 శాతం ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ మొన్న గాంధీభవంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలోగానీ, మక్తల్, కొత్తగూడెం, హుస్నాబాద్‌లలో జరిగిన బహిరంగ సభలోగానీ సీఎం రేవంత్‌రెడ్డిగానీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆ మాటే మాట్లాడడం లేదన్నారు. బీసీలను మోసగించడానికి 60 శాతం అంటూ డ్రామాలాడారని ఆయన మండిపడ్డారు. ఇక సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీ పర్యటనలో ప్రధాని నరేంద్రమోడీని కలిసిన సందర్భంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల గురించి ప్రధానితో చర్చించకపోవడం బీసీలను నయవంచనకు గురిచేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు.అడగాల్సిన కాంగ్రెస్ అడగడం లేదని, చేయాల్సిన బిజెపి బీసీ




రిజర్వేషన్ల బిల్లును తొక్కిపెడుతుందని, బీసీలను నమ్మించి మోసం చేయడంలో బిజెపి, కాంగ్రెస్ దొందు దొందేనని, వారి అబద్ధాలకు ఎన్ని అవార్డులు ఇచ్చిన సరిపోవని ఆయన ఎద్దేవా చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు 5380 సర్పంచ్ స్థానాలు దక్కేవని, బీసీ రిజర్వేషన్లను 17 శాతంకు తగ్గించడం వలన కేవలం 2300 సర్పంచ్ సీట్లు బీసీలకు వచ్చినవి.. ఇలా బీసీలను మోసం చేశారన్నారు. రాజకీయ పార్టీలు బీసీలకు చేసిన మోసానికి బుద్ధి చెప్పాలంటే రాష్ట్రంలోని జనరల్ స్థానాలలో నిలబడిన బీసీ అభ్యర్థులను పార్టీలకతీతంగా గెలిపించి సర్పంచ్ ఎన్నికల్లో బీసీల సత్తాను చాటి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని ఈనెల 15వ తేదీన ఢిల్లీలో పార్లమెంటును ముట్టడించడానికి జిల్లా నుండి పార్టీలకతీతంగా వేలాదిమంది ఢిల్లీకి తరలిరావాలని, 16వ తేదీన ఢిల్లీలో జరిగే అఖిలపక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ నేతలు దొడ్డపల్లి రఘుపతి, చిర్ర రాజు, బోనగాని యాదగిరిగౌడ్, తమ్మేల శోభారాణి, తెల్ల సుగుణ, కిశోర్ భీమగాని యాదగిరి, బక్కి అవినాష్ పాల్గొన్నారు.

## తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా కేసీఆర్ : బడుగుల లింగయ్య యాదవ్

### సూర్యాపేటలో ఘనంగా విజయ్ దివస్

సూర్యాపేట, డిసెంబర్ 09 : తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుని, కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్ చేసిన కేసీఆర్ పేరు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విజయ్ దివస్ ను సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి గాలిలోకి గులాబీ బెలూన్లు ఎగురవేశారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగివచ్చిన యూపీఏ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిందన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 14 ఏళ్లు ఉద్యమం నిర్వహించిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరడంతో పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమ నాయకుడే ముఖ్యమంత్రిగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారి అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అలాగే గ్రామ గ్రామానికి మిషన్ భగీరథ మంచినీరు అందించడంతో పాటు మిషన్ కాకతీయ కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతుల సాగునీటి కష్టాలు తీర్చాడని కొనియాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంతో పాటు సాధించిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుని దేశానికి రోల్ మోడల్‌గా చేసిన కేసీఆర్ ను తెలంగాణ ప్రజానీకం ఎప్పటికీ మర్చిపోదన్నారు.డిసెంబర్ 9ని విజయ్ దివస్‌గా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేసిన పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెరుమాండ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, నాయకులు ఆకుల లవకుశ, తాహిర్ పాషా, బత్తుల రమేశ్, సుంకరి రమేశ్, బండారు రాజా, సయ్యద్ సలీం, మొయినుద్దీన్, కరాటే సయ్యద్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, అంగోతు భావ్ సింగ్, మద్దెల వీరస్వామి, సల్మా మస్తాన్, కరుణ శ్రీ, చనగాని అంజమ్మ, కల్లేపల్లి మహేశ్వరి పాల్గొన్నారు.

## ఆ పని చేసేందుకు ఈసీకి చట్టబద్ధమైన హక్కు లేదు : కాంగ్రెస్




న్యూఢిల్లీ: ఎన్నికల సంస్కరణల పై మంగళవారం లోక్‌సభ లో వాడీవేడి చర్చ జరుగుతున్నది. ఎన్నికల సంస్కరణలపై చర్చలో భాగంగానే ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ' పై చర్చిస్తున్నారు. ఈ చర్చలో ఎంపీ మనీశ్ తివారీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎదురుదాడికి దిగింది. ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ చేసే హక్కు ఎన్నికల సంఘానికి లేదని మనీశ్ తివారీ వ్యాఖ్యానించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాత వైఖరి, చట్టబద్ధమైన అధికారాలపై మనీశ్ తివారీ ప్రశ్నలు లేవనెత్తారు. కేంద్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాత వైఖరిని అవలంభిస్తున్నదా..? అనే విషయంలో చాలామంది సభ్యులు ప్రశ్నలు లేవనెత్తుతుండటం దురదృష్టకరమని అన్నారు.ఎన్నికల సంస్కరణల్లో భాగంగా ముందుగా సవరించాల్సినది ఎన్నికల సంఘం సభ్యులను ఎన్నుకునే విధానాన్నేనని మనీశ్ తివారీ చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘంలో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్‌లతోపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి కూడా చోటు కల్పిస్తే బాగుంటుందనేది తన సూచన అని చెప్పారు.ఎన్నికల సంస్కరణలపై చర్చలో కాంగ్రెస్ పార్టీ తరఫున మనీశ్ తివారీతోపాటు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, మరో సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్, వర్ష గైక్వాడ్, మహ్మద్ జావేద్, ఉజ్వల్ రమణ్‌సింగ్, ఇషా ఖాన్, మల్లు రవి, ఇమ్రాన్ మసూద్, గొవాల్ పడవి, ఎస్ జ్యోతిమని పాల్గొననున్నట్లు పార్టీ తెలిపింది.

## కేంద్రానికి మాత్రమే తమిళనాడు, పుదుచ్చేరి వేర్వేరు : టీవీకే చీఫ్ విజయ్



కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే తమిళనాడు పుదుచ్చేరి వేర్వేరు అని, తాము మాత్రం అందరం కలిసే ఉన్నామని నటుడు, టీవీకే చీఫ్ విజయ్ అన్నారు. పుదుచ్చేరిలోని ఉప్పాలం లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కరూర్ తొక్కిసలాట అనంతరం జరిగిన ఈ తొలి బహిరంగసభలో ఆయన.. తమిళనాడులోని డీఎంకే సర్కారు పై తీవ్ర విమర్శలు చేశారు.పుదుచ్చేరికి మద్దతు ఇవ్వడం తన బాధ్యత అని విజయ్ పేర్కొన్నారు. సీఎం రంగసామి నేతృత్వంలోని అక్కడి ప్రభుత్వం డీఎంకే ప్రభుత్వం వంటిది కాదని, ప్రతిపక్ష పార్టీలతోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని మెచ్చుకున్నారు. మాకు ప్రత్యర్థి అయినా మా పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి అడగగానే భద్రత రంగస్వామి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రాష్ట్ర పాలనకు సంబంధించిన విషయాలను పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి నేర్చుకోవాలని సూచించారు.కానీ ఆయన (స్టాలిన్) ఎప్పటికీ నేర్చుకోరని విజయ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మాజీ సీఎం, దివంగత ఎంజీ రామచంద్రన్‌కు పుదుచ్చేరితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ.. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా ఇవ్వాలని పునరుద్ఘాటించారు. తమకు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నో సంవత్సరాల నుంచి 16 తీర్మానాలను ప్రవేశపెట్టినా కేంద్రం పట్టించుకోవట్లేదని విమర్శించారు.

## ప్రశాంత ఎన్నికలు ప్రతి ఒక్కరి బాధ్యత : సీపీ సునీల్ దత్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 09 : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు, రాజకీయ నాయకుల బాధ్యత ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట సర్కిల్ వద్ద గల రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఖమ్మం రూరల్ మండలంకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 14న మండలంలోని గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ప్రచార కార్యక్రమాలు ముగించాలన్నారు. ప్రతి గ్రామంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ తరపున, ఎన్నికల అధికారుల తరపున అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎలాంటి అలజడులు, గొడవలకు తావిపోవద్దని, వ్యక్తిగత వివాదాలకు చోటు ఇవ్వరాదన్నారు. ఎన్నికల నియమాలను తప్పకుండా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ఎన్నికల అధికారులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. 5 వేల లోపు ఓటర్లు కలిగిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.1,50,000, వార్డు అభ్యర్థి రూ.30 వేల లోపు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో అభ్యర్థులు చేసే ఖర్చుపై ప్రత్యేకంగా షాడో టీంలు పసిగడుతున్నాయన్నారు. ఓటర్లను పోలింగ్ స్టేషన్ వద్దకు తీసుకువచ్చే బాధ్యత ఎన్నికల అధికారులే చూసుకుంటారని, రాజకీయ పార్టీల నాయకులు జోక్యం చేసుకోవద్దన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో ఎన్నికలు జరిగితేనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని తద్వారా గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు.

# జనవరి 1 నుంచి మదనపల్లి జిల్లా...

తిరుపతి, డిసెంబర్ 9,ప్రజలకు మెరుగైన పరిపాలన అందించాలని ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కొత్త జిల్లాల్లో పారిపాలన ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో కొత్తగా ఏర్పాటు చేసిన మదనపల్లె జిల్లాలో పరిపాలన షురూ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. 2026 జనవరి 1 నుంచి పరిపాలన ప్రారంభం కాబోతున్నట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ కార్యాలయాల ఎంపికపై కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ఏపీలో పాలనా వికేంద్రీకరణ, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించే లక్ష్యంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది కూటమి ప్రభుత్వం. కొత్త జిల్లాలకు సంబంధించి ఇటీవలే ప్రభుత్వం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే కొత్త జిల్లాల్లో పరిపాలన ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా మదనపల్లె కేంద్రంగా కొత్తగా ఏర్పాటైన జిల్లాలో.. 2026 జనవరి 1 పరిపాలన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.కొత్త జిల్లాలో పారిపాలనకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన సంకేతాలు అందినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు ఎంపిక చేయడంపై కలెక్టర్ నిషాంత్ కుమార్ దృష్టి సారించారు. ఇప్పటికే మదనపల్లెలో ఉన్న సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని.. నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయంగా ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఇటీవల ప్రారంభించిన డీఎల్‌డీవో కార్యాలయంలో.. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇక ఇతర విభాగాల కార్యాలయాల కోసం కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.మదనపల్లెలోని బీటీ కాలేజీలో కొన్ని విభాగాలను, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు తాత్కాలికంగా వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ ఇవి సరిపోకపోతే.. ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకునే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో పరిపాలనకు సంబంధించి దాదాపు 60 విభాగాలుంటాయి. వీటికి తాత్కాలిక కార్యాలయాలు అవసరం. అయితే అందులో 50 శాతం కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోనే ఏర్పాటు చేయొచ్చనే అభిప్రాయానికి వచ్చారు అధికారులు. మిగతా కార్యాలయాలను.. ప్రైవేటు భవనాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.మరికొన్ని రోజుల్లో కార్యాలయాలను ఎంపిక చేసి.. ఆ నివేదికను ప్రభుత్వానికి పంపించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆఫీస్ ఏర్పాటుకు భవనం ఇంకా దొరకలేదని తెలుస్తోంది. జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలు కొత్త జిల్లాలోని బీటీ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించాలని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. కాగా, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాలతో మదనపల్లె జిల్లా ఏర్పాటు అయింది. మదనపల్లె, పీలేరు రెవెన్యూ డివిజన్లు ఈ కొత్త జిల్లాలో ఉన్నాయి. కాగా, పుంగనూరు నియోజకవర్గంలో రొంపిచెర్ల మండలం మదనపల్లె జిల్లాలో ఉండనుంది. కానీ చిత్తూరు రెవెన్యూ డివిజన్ కిందికి వస్తోంది. గెజిట్ నోటిఫికేషన్‌లో కూడా ఇలాగే ఉంది. అందుకే ఆ మండలాన్ని పీలేరు రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# కిలారీ కిం... కర్తవ్యం..

గుంటూరు, డిసెంబర్ 9, కిలారి రోశయ్య జనసేనలో చేరాక కనిపించకుండా పోయారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అల్లుడు కిలారి రోశయ్యకు 2019 ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ పొన్నూరు టిక్కెట్ ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర పై కిలారి రోశయ్య గెలవడంతో ఉమ్మారెడ్డి లెగసీని అందిపుచ్చుకుంటారని భావించారు. 2024 ఎన్నికల వరకూ కిలారి రోశయ్య వైసీపీలోనే కొనసాగారు. ధూళిపాళ్ల నరేంద్ర కు వ్యతిరేకంగా అనేక విమర్శలు చేశారు. అయితే ఆయన 2014 ఎన్నికల తర్వాత తన రాజకీయ ప్రయాణం వైసీపీలో సాఫీగా సాగే అవకాశం లేదని భావించి ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. జనసేన కండువా కప్పుకున్నారు. పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయన జనసేనలో చేరారు.వ్యక్తిగత కారణాల వల్ల తాను పార్టీని వీడుతున్నట్లు నాడు జగన్ కు రాసిన లేఖలో కిలారు రోశయ్య పేర్కొన్నారు. వైసీపీ వీడి జనసేనలో చేరిన తర్వాత కిలారి రోశయ్య ఎక్కడా కనిపించడం లేదు. ఆయన పొన్నూరుకు వెళ్లినా పెద్దగా పట్టించుకునే వారు లేరు. అలాగే జనసేన స్థానిక నేతలు కూడా కిలారి రోశయ్యను దరిదాపుల్లోకి కూడా రానివ్వడం లేదు. అస్సలు పొన్నూరు జనసేన నేతలు కిలారి రోశయ్యను తమ నేతగా కూడా గుర్తించడం లేదు. కేవలం పొన్నూరు మాత్రమే కాదు.. గుంటూరు జిల్లాలోని ఏ నియోజకవర్గంలోనూ ఆయనకు జనసేన నేతగా గుర్తింపు ఇంత వరకూ దొరకలేదు. వైసీపీని వీడటానికి ప్రధాన కారణం తన మామ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా ఇవ్వలేదని ఆయన పార్టీనివదిలి వెళ్లారని అప్పట్లో ప్రచారం జరిగింది. జనసేనలో కిలారి రోశయ్య చేరి ఒకటిన్నర సంవత్సరం దాటుతున్నప్పటికీ జనసేనలోనూ ఆయనకు పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అల్లుడిగానే ఆయనకు గుర్తింపు ఉంది. జనసేన పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన దూరంగా ఉంటున్నారు. అసలు కిలారి రోశయ్య జనసేనలో ఉన్నారా? అన్న అనుమానం కూడా కలుగుతుంది. ఎందుకంటే ఎక్కువగా హైదరాబాద్, గుంటూరుకు మాత్రమే కిలారి రోశయ్య పరిమితమయ్యారని తెలిసింది. అయితే అందుతున్న సమాచారం మేరకు ఆయన జనసేనలోనూ అంత సంతృప్తికరంగా లేరని అంటున్నారు. త్వరలోనే ఆయన జనసేనకు కూడా గుడ్ బై చెప్పి తిరిగి వైసీపీలో చేరతారన్న ప్రచారం మాత్రం జోరుగా జరుగుతుంది. కానీ వైసీపీ అధినేత నుంచి గ్రీన్ సిగ్నల్ ఇంకా లభించకపోవడంతో ప్రస్తుతానికి జనసేన నేతగానే ఆయన పూర్తి స్థాయి విశ్రాంతిలో ఉన్నారని చెబుతున్నారు.

# అమలోద్భవిమాత 72వ వార్షికోత్సవ మహోత్సవాలు

అమలాపురం,అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం మహిపాలవారి వీధిలో కొలువై ఉన్న కేథలిక్ ఆరాధ్యదైవం అమలోద్భవిమాత పుణ్యక్షేత్రంలో 72వ వార్షికోత్సవ మహోత్సవాలు రెవరెండ్ ఫాదర్ బెల్లంకొండ ఇన్యాస సౌరయ్య ఆధ్వర్యంలో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.నవదిన ప్రార్థనలు సమాప్తమయ్యాక, కాథలిక్ సంఘ విశ్వాసులు, జేసుసభ గురువులు, ఉపదేశకులు, సంఘపెద్దలు, సిస్టర్స్, యూత్ వింగ్, మరియదళ సభ్యులు కలిసి పట్టణంలో పవిత్ర జపమాల ఉచ్చరిస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు.ఫాదర్ బెల్లంకొండ సౌరి మాట్లాడుతూ అమలోద్భవిమాత మహోత్సవాలను ఈసారి ఎంతో భక్తి ప్రపత్తులతో నిర్వహించాం. 25 మంది విచారణ గురువులను ఆహ్వానించి, అమలాపురంలో కాథలిక్ మత విశ్వాసం విశిష్టత పెంచేలా కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. పుణ్యక్షేత్ర అభివృద్ధి, రానున్న క్రిస్మస్ ? బాల యేసు జన్మదిన వేడుకలను కూడా ఇదే భక్తిశ్రద్ధతో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

# కర్నూలు చుట్టూ ఓఆర్ఆర్

కర్నూలు, డిసెంబర్ 9,ర్నూలు నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. భారీ వాహనాలు, బస్సులు నగరంలోకి రాకుండా బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించేందుకు 17 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు ప్లాన్ చేస్తున్నారు. దీనివల్ల కూడళ్ల వద్ద ఇబ్బందులు తగ్గి, ప్రయాణం సులభతరం అవుతుందని అధికారులు ఆశిస్తున్నారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఈ కర్నూలు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అవసరమైన చోట్ల రింగ్ రోడ్డును ప్లాన్ చేస్తోంది. ఈ మేరకు అధికారులు నివేదికలు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. కర్నూలులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ముఖ్యంగా కూడళ్ల వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భారీ వాహనాలు, బస్సులు నగరంలోకి ప్రవేశించకుండా మళ్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సులు, భారీ వాహనాలు నగరంలోకి రాకుండా నేరుగా బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లేలా రింగ్ రోడ్డు ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రణాళికతో కూడళ్ల వద్ద వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులు రింగ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ పనులు పూర్తయితే, నగరంలో ట్రాఫిక్ సమస్యలు కొంతవరకు తగ్గుతాయని అధికారులు తెలిపారు.కర్నూలు నగరం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని.. అధికారులు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం, 200 అడుగుల వెడల్పుతో 17 కిలోమీటర్ల మేర ఈ రింగ్ రోడ్డును నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాన్ని నగరపాలక, ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటికే పరిశీలించారు. మూడు నెలల్లో డీపీఆర్ తయారు చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదిత రింగ్ రోడ్డు నిర్మాణానికి గల ముఖ్య కారణం, నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని తగ్గించడం. భవిష్యత్తులో కర్నూలు నగరం మరింత అభివృద్ధి చెందుతుందని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులు భావిస్తున్నారు.ఈ రింగ్ రోడ్డు వల్ల నగరంలోకి ప్రవేశించే వాహనాలు నేరుగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల నగరంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ భారం తగ్గుతుంది. ప్రస్తుతం, రింగ్ రోడ్డు ఏర్పాటు చేయనున్న ప్రాంతంలో ఎంత ట్రాఫిక్ ఉందో అధికారులు అంచనా వేయనున్నారు. ఈ అంచనా ఆధారంగానే రింగ్ రోడ్డు డిజైన్, ఇతర సాంకేతిక అంశాలు ఖరారు చేయబడతాయి. డీపీఆర్ తయారీ పూర్తయిన తర్వాత, ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపనున్నారు. నిధులు మంజూరైతే, రింగ్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా ప్రారంభమవుతాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, కర్నూలు నగరం మరింత సుందరంగా, సులభంగా ప్రయాణించే వీలు కలుగుతుంది.ఈ కొత్త రింగ్ రోడ్డు కల్లూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను గణనీయంగా తగ్గిస్తుంది. వాహనాలు పట్టణంలోకి రాకుండా బయటి నుంచే వెళ్లేలా ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. దీనివల్ల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. లక్ష్మీపురం బైపాస్ నుంచి కోడుమూరు రోడ్డులోని పెద్దపాడు వరకు 7.2 కిలోమీటర్ల మేర మొదటి దశ నిర్మాణం ఉంటుంది. ఆ తర్వాత, పెద్దపాడు సమీపంలోని కోడుమూరు రోడ్డు నుంచి హైదరాబాద్ రహదారి అయిన ఎన్‌హెచ్-44 వద్ద మునగాలపాడు రోడ్డు వరకు మరో 9.9 కిలోమీటర్ల మేర రింగ్ రోడ్డును అనుసంధానం చేస్తారు. ఈ రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల సూరత్ హైవేపై వెళ్లే వాహనాలు కల్లూరు పట్టణంలోకి రాకుండా, కోడుమూరు మార్గాన్ని ఉపయోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. ఇది పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తుంది.ప్రజలకు ఇబ్బంది కలగకుండా, భవనాలు లేదా ప్రైవేటు భూములు కోల్పోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రింగ్ రోడ్డు నిర్మాణం ఎక్కువగా ప్రభుత్వ భూమిలోనే జరిగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే, ప్రజలకు ప్రయాణం చాలా సులభతరం అవుతుందని, సమయం ఆదా అవుతుందని నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ పేర్కొన్నారు. ఇది పట్టణ అభివృద్ధికి కూడా దోహదపడుతుంది

# కడపలో పవర్ గేమ్...

కడప, డిసెంబర్ 9, పోటాపోటీ ఫైట్‌తో.. కడప గడపలో పొలిటికల్ రచ్చ కాకరేపుతోంది. ఒకరి మీద మరొకరు పైచేయి సాధించేందుకు..ఎవ్వరూ తగ్గడం లేదు. ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కడప మేయర్ ఎన్నిక రాజకీయ వేడిని రాజేస్తోంది. కొన్నాళ్లుగా కడప కార్పొరేషన్ గొడవ ఎంతకూ కొలిక్కి రావడం లేదు.ఒకవైపు మేయర్ సురేష్ బాబుపై ప్రభుత్వం వేసిన అనర్హతపై రచ్చ నడుస్తూనే ఉంది. మరోవైపు ఆయన హైకోర్టులో న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. 9న కోర్టు విచారణ ఉండగా..ఒక్క రోజు గ్యాప్‌లోనే 11వ తారీఖున కౌన్సిల్ మీటింగ్‌కు షెడ్యూల్ ఫిక్స్ అయింది. కార్పొరేటర్లందరూ తప్పకుండా హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ ఇన్విటేషన్ పంపడం చర్చనీయాంశంగా మారింది. మేయర్‌పై అనర్హత వేటును కోర్టు కొట్టి పారేస్తుందా.? కౌన్సిల్ మీటింగ్ జరిగితే మరోసారి రసాభాసా జరుగుతుందా అనేది ఉత్కంఠ రేపుతోంది. కడప మేయర్‌గా సురేష్‌బాబు మొన్నటివరకు పదవిలో ఉన్నారు. ఆయనపై అవినీతి ఆరోపణలు..సొంత కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం వంటి అలిగేషన్స్‌తో..టీడీపీ పట్టుబట్టి సురేష్‌బాబును పదవి నుంచి తొలగించింది. తన మీద తీసుకున్న చర్యలను సవాల్ చేస్తూ..అకారణంగా మేయర్ సీటు నుంచి తనను తొలగించారని సురేష్ బాబు న్యాయపోరాటం చేస్తున్నారు.ఇప్పటికే పలుసార్లు కోర్టు ఆదేశాలు ఇవ్వడం..టీడీపీ నేతలు, కూటమి ప్రభుత్వం దానిపై అప్పీల్‌కు వెళ్లడం కామన్ అయిపోయింది. 11వ తేదీన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని..ప్రతి కార్పొరేటర్ రావాలని కడప జేసీ ఇప్పటికే ఆహ్వానం పంపించారు. కడప నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో 11వ తేదీన ఉదయం 11 గంటలకు కొత్త మేయర్ ఎన్నిక జరగనుంది. జాయింట్ కలెక్టర్ కార్పొరేటర్లకు పంపిన ఆహ్వానంతో మున్సిపల్ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.కడప కార్పొరేషన్‌లో 50 స్థానాలు ఉంటే..అందులో ఒకటి టీడీపీ, మరొకటి ఇండిపెండెంట్..48 స్థానాల్లో వైసీపీ గెలిచింది. ఇద్దరు కార్పొరేటర్లు చనిపోగా..కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఇప్పుడు కార్పొరేషన్‌లో వైసీపీ సంఖ్యా బలం 40కి చేరింది.మేయర్ ఎన్నిక అనివార్యమన్న ప్రచారం నేపథ్యంలో.. టీడీపీ ఇప్పటికే పోటీ చేయబోమని చెప్పింది. ఇక వైసీపీలోనే మేయర్ సీటు కోసం ఆశావహులు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నారట. కడప మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం..వచ్చే ఏడాది మార్చి 18న ముగియనుంది. అంటే ఎవరు మేయర్ అయినా..ఇంకో మూడు నెలలు మాత్రమే పదవిలో ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మేయర్ అయ్యేదెవరు.? వైసీపీ అధినేత ఆశీస్సులు ఎవరికి అనేది ఉత్కంఠ రేపుతోంది.మేయర్ ఎన్నికకు దూరంగా ఉంటామని టీడీపీ చెప్పినప్పటికీ..ఇంటర్నల్‌గా మేయర్ పీఠం కోసం పెద్ద ప్లానే వేస్తున్నారట తెలుగు తమ్ముళ్లు. కూటమి తరపున టీడీపీ మేయర్ పీఠాన్ని సొంతం చేసుకోవాలంటే 26 మంది సభ్యుల బలం ఉండాలి. అయితే కడప చుట్టుపక్కల ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎక్స్‌అఫీషియో మెంబర్స్‌తో పాటు వైసీపీ నుంచి కొంతమంది కార్పొరేటర్ల సైకిల్ ఎక్కేందుకు రెడీగా ఉన్నారని టీడీపీ ధీమాగా ఉందట.కడప మేయర్ పదవిని వైసీపీకి దక్కకుండా చేయాలనేది టీడీపీ స్కెచ్ అంటున్నారు. మరోవైపు సురేష్ బాబు స్థానంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంను తాత్కాలిక మేయర్‌గా కొనసాగుతున్నారు. అయితే తనను అకారణంగా పదవి నుంచి తొలగించారంటూ..మేయర్ ఎన్నికల నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ సురేష్ బాబు హైకోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణ జరగనుంది. కోర్టు ఇచ్చే తీర్పు తర్వాతే మేయర్ ఎన్నికపై ఫుల్ క్లారిటీ రానుంది. కడప మేయర్ సీటుకు ఎన్నికలు జరిగితే మాత్రం తీవ్ర ఉత్కంఠకు తెరలేపే చాన్స్ అయితే ఉందంటున్నారు. చూడాలి మరి ఏం జరగబోతోందో.?

# మళ్లీ రాజకీయాల్లోకి జయప్రద...

విజయవాడ, డిసెంబర్ 9, సినీనటి జయసుధ తిరిగి రాజకీయాల్లోకి వస్తారన్న ప్రచారం జరుగుతుంది. జయసుధ గత కొంత కాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కానీ జయసుధ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి వస్తారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. గతంలో సికింద్రాబాద్ శాసనసభ్యురాలిగా జయసుధ పనిచేశారు. నాడు కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యురాలిగా ఉన్నారు. గతంలో కాంగ్రెస్ శాసనసభ్యురాలిగా ఐదేళ్ల పాటు కొనసాగారు. అధికారంలో ఉన్నప్పుడు ఆమె కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి పెద్ద యెత్తున్ నిధులు తెచ్చుకున్నారు. అప్పట్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జయసుధకు కాంగ్రెస్ సీటు దక్కింది. ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. ఐదేళ్ల పాటు కాంగ్రెస్ లో కొనసాగిన జయసుధ తర్వాత ఏ పార్టీలోనూ చేరలేదు. కాంగ్రెస్, వైసీపీ, బీజేపీలో చేరిన జయసుధ ఇప్పుడు ఏ పార్టీలో చేరనున్నారన్నది మాత్రం తెలియరాలేదు.తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా టాలివుడ్ లో స్థిరపడ్డారు. అయితే ఆమె ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోవడంతో పాటు వైఎస్ మరణం తర్వాత జయసుధ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. అయితే కొంత కాలం క్రితం తెలంగాణకు చెందిన ఓ నిర్మాతతో కలిసి జయసుధ బీజేపీ నేత కిషన్‌రెడ్డిని కలిసినప్పుడు ఆమె బీజేపీ లో చేరతారని ప్రచారం జరిగింది. బీజేపీ కండువా కప్పుకున్నారు. బీజేపీలో చేరకి సికింద్రాబాద్ లేదా ముషీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా జయసుధ పోటీ చేసే అవకాశం ఉందని అప్పట్లో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. కానీ అవేమీ కార్యరూపం దాల్చలేదు. తర్వాత వైసీపీలో చేరారు. కండువా కప్పుకున్నారు. తర్వాత ఆ పార్టీకి కూడా దూరంగానే ఉన్నారు. రాజకీయాలకు స్వస్తిచెప్పి సినిమాల్లో బిజీగా మారారు. కానీ తాజాగాఆమె తిరిగి రాజకీయాల్లోకి వస్తారని, అదీ ఏపీ నుంచి రాజకీయాల్లోకి వస్తారని చెబుతున్నారు.సహజనటి జయసుధ సొంత గ్రామం కృష్ణా జిల్లాలోనే ఉంది. అందుకే జయసుధ ఏపీ రాజకీయాల పట్ల ఆసక్తి చూపుతున్నారంటున్నారు. కానీ జయసుధ మాత్రం తాను రాజకీయాల్లోకి వచ్చే విషయాన్ని కొట్టిపారేయడం లేదు. తనను రాజకీయాలలోకి ఎవరైనా ఆహ్వానిస్తే వస్తానని ఆమె తాజాగా మీడియాకు చెప్పడం విశేషం. తనకు కూడా రాజకీయాల పట్ల ఆసక్తి ఉందని, అయితే ఏ పార్టీలో చేరేదీ తాను చెప్పలేనని జయసుధ అన్నారు. రాజకీయాల్లోకి రావాలని కోరితే వస్తానని జయసుధ అనడంతో ఆమె ఏ పార్టీలో చేరతారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై విమర్శలు చేశారు. పవన్ కొబ్బరి తోటలు ఎండిపోవడానికి, తెలంగాణ దిష్టి వ్యాఖ్యలను తప్పుపట్టారు. అదే సమయంలో ఎక్కడా మతమార్పిడులు జరగడం లేదని చెప్పడంతో జయసుధ చూపు వైసీపీ వైపు ఉందా? లేక టీడీపీ లో చేరతారా? అన్నది మాత్రం సస్పెన్స్ గానే ఉంది.



# కూటమిని చీల్చేది ఎలా...

విజయవాడ, డిసెంబర్ 9,ఏపీలో రాజకీయం ఆసక్తిగా మారుతుంది. ముఖ్యంగా కూటమి పార్టీల మధ్య చక్కటి సమన్వయం కొనసాగుతోంది. ఇది ఎంత మాత్రం రుచించడం లేదు జగన్మోహన్ రెడ్డిని అభిమానించే వారికి. ఆయన మంచి కోరే వారు చాలామంది తటస్తులుగా ఉన్నారు. వారు సైతం కూటమిగా ఉంటే జగన్మోహన్ రెడ్డికి లాభం లేదని తేల్చేస్తున్నారు. అందుకే కూటమి పార్టీలు విడిపోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు. సాక్షి మీడియాతో పాటు వైయస్సార్ కాంగ్రెస్ సోషల్ మీడియా సైనికుల వలే పని చేస్తున్నారు కూటమి పార్టీల మధ్య గొడవల కోసం. జన సైనికులపై సానుభూతి చూపుతూ టిడిపి పై రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు జనసేన ముసుగులో. కానీ కూటమిలో కింది స్థాయి శ్రేణులు ఏవేవో విభేదాలు చూపుతున్నాయి తప్ప.. నాయకత్వంలో నిర్ణయంలో ఎంత మాత్రం మార్పు లేదు. మరో 15 సంవత్సరాలు పాటు కూటమి కొనసాగుతుందని పవన్ కళ్యాణ్ ఇదివరకే చాలాసార్లు చెప్పారు. ఇప్పుడు చంద్రబాబుతో పాటు లోకేష్ అదే మాట చెబుతుండడంతో జగన్ సన్నిహితులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.తాజాగా పవన్ కళ్యాణ్ తమిళనాడు వెళ్లి కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికలకు ముందు ఎన్నో రకాల సమస్యల నడుమ ధర్మం వైపు నిలబడ్డానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం కీలకంగా మారిన విషయాన్ని చెప్పుకొచ్చారు. ఇప్పుడే కాదు అన్నివేళలా పవన్ కళ్యాణ్ అదే విషయాన్ని చెబుతున్నారు. కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగుతుందని తేల్చి చెప్పారు. కూటమిలో నాయకత్వం విషయంలో పక్కన పెడితే.. ఎవరు నాయకత్వం వహిస్తారన్న ప్రశ్న తలెత్తకుండా.. మేము గొప్ప మీరు గొప్ప అన్న తేడా లేకుండా దాదాపు ఏడాదిన్నర పాలనను సజావుగా ముందుకు తీసుకెళ్లారు. తమ మధ్య పొత్తు విచ్ఛిన్నం కాదు అని సంకేతాలు పంపగలరు. తమ మధ్య విభేదాలు వచ్చే అవకాశం లేదని.. క్షేత్రస్థాయిలో కిందిస్థాయిలో పార్టీ నేతల మధ్య విభేదాలు వచ్చిన పట్టించుకోమని సంకేతాలు పంపుతున్నారు మూడు పార్టీల నాయకులు.అయితే ఎట్టి పరిస్థితుల్లో మూడు పార్టీల మధ్య పొత్తు చెదరదని వైసీపీ సన్నిహితులకు అర్థమయింది. తటస్తుల రూపంలో చాలామంది జగన్మోహన్ రెడ్డి సన్నిహితులు బయట ఉన్నారు. వారంతా కూటమి మధ్య విరుగుడు రావాలని బలంగా కోరుకుంటూ వస్తున్నారు. కానీ ఎట్టి పరిస్థితుల్లో విడిపోమని కూటమి కీలక నేతల నుంచి సంకేతాలు వస్తుండడంతో వారికి మింగుడు పడటం లేదు. మొన్నటి వరకు చంద్రబాబును వ్యతిరేకించి పవన్ కళ్యాణ్ ను అందలం ఎక్కించే విశ్లేషకులు ఉన్నారు. సలహాల రూపంలో పవన్ కళ్యాణ్ కు నూరి పోస్తే ఏదో విధంగా ఆయన బయటకు వస్తాడని భావించారు. కానీ వారి ప్రయత్నాలు ఏవి వర్కౌట్ కావడం లేదు. ఎంతసేపు దిగువ స్థాయిలో చేస్తున్నా ఆ ప్రభావం కూటమిపై పడడం లేదు. అందుకే జగన్మోహన్ రెడ్డికి వారు నేరుగా హితబోధ చేస్తున్నారు. కూటమి మధ్య విభేదాలపై దృష్టి పెట్టకుండా సొంతంగా ఎదిగే ప్రయత్నం చేయాలని సూచిస్తున్నారు. అయినా సరే అది చాలా కష్టమైన పని అని కూడా వారు తేల్చి చెబుతుండడం విశేషం.

# కొండగుడి పండగకు పోటెత్తిన భక్తులు

విశాఖపట్నం,పాతపట్నం కొండగుడి పండగకు భక్తులు పోటెత్తారు.ఏటా జరిగే కొండగుడి పండగకు పలు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తంటా రు.పాత పోస్టాఫీస్ వద్ద గల కొండ గుడి పై కొలువుదీరి కులమతాలతో సంబంధం లేకుండా భక్తులంతా కొలిచే తల్లి అమలోద్భవి విశాఖ పురి మేరిమాత.మేరీ మాత పుణ్యక్షేత్రం విశాఖపురికి ప్రత్యేక ఆభరణం. దీనినే కొండగుడిగా భక్తులు పిలుచుకుంటారు. మేరిమాత ఉత్సవం పురస్క రించుకొని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు.వాయిస్ ... ఏటా డిసెంబరు 8వ తేదీ కొండపై ఉత్సవ సందడి కనువిందు చేస్తుంది. నవంబరు 29వ తేదీన ఇందుకు శ్రీకారం చుట్టి తొమ్మిది రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు అమలోద్భవి పండుగ ప్రత్యేకం. 155 ఏళ్ల చరిత్ర కలిగిన రోస్హిల్స్లో అమలోద్భవి మాత దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి విశ్వాసకులు క్యూ కడతారు. కులమతలాలకు అతీతంగా క్రైస్తవులు, హిందువులు, ముస్లింలు, ఇతర వర్గాలు మేరీమాత దర్శనం చేసుకుని ఆశీర్వాదం పొందుతారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు తలనీలాలు, మొక్కుబడులు సమర్పించుకుంటారు.ఈ సారి కూడా అధిక సంఖ్యలో తరలిరావడంతో కొండగుడి వద్ద సందడి వాతావరణం నెలకొంది.

